ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 19 సంచిక : 02 అక్టోబర్ 2013

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ 1992

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు – సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ 1992)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహం మరణించేవరకు మనం ఎలా ఆహారం తీసుకొంటూ ఉంటామో అలాగే మనస్సు నశించే వరకూ సాధన చేస్తూ ఉండాలి. మనం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చాము అనే ప్రశ్న చాలా ముఖ్యం. రోజుకు ఒక్కసారి అయినా ఇలా ప్రశ్నించుకోవాలి. ఈ ప్రశ్న మన ఆధ్యాత్మిక అభివృద్ధికి సహకరిస్తుంది. ఆహారం విషయంలో అజాగ్రత్తగా ఉంటే తమోగుణం పెరుగుతుంది, ఇది రజోగుణానికి దారి తీస్తుంది. తమోగుణం, రజోగుణం ఆధ్యాత్మికజీవితానికి సహకరించవు. ఈ గుణాలలో ఉండగా సాధన కష్టం. స్నేహం విషయంలో జాగ్రత్త అవసరం. లౌకికులతో స్నేహం చేస్తూ ఉంటే అది అనేక నీచజన్మలకు కారణం అవుతుంది. మన చుట్టూ ఉన్నవారు ఆధ్యాత్మికజీవితం గడుపుతూ ఉంటే వారు మన ఆధ్యాత్మికఅభివృద్ధికి సహకరిస్తారు. మనం బాగుపడినా, చెడిపోయినా దానికి మనస్సే కారణం. అందువలన మనస్సును చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. కోరికలు, అలవాట్లు, వాసనలు అన్నీ మనస్సులో ఉన్నాయి. అవి తరువాత జన్మలకు కారణం అవుతాయి. భౌతికమైన అగ్నివలన అవి కాలవు. జ్ఞానాగ్ని వలన మాత్రమే అవి పూర్తిగా దహింపబడతాయి.

ప్రపంచాన్ని జ్ఞాని చూస్తున్నాడు, అజ్ఞాని చూస్తున్నాడు. అయితే జ్ఞానికి మోహం కలగటం లేదు, అజ్ఞానికి మోహం కలుగుతోంది. ఎందుచేతనంటే అజ్ఞాని ఈ లోకాన్ని చూసేటప్పుడు లోకంలో ఉన్న నామరూపములతో తాదాత్మ్యం చెందటం వలన, వాటితో సంబంధం వలన అతడికి వికారం కలుగుతుంది. జ్ఞాని ఈ లోకంలో ఉన్న నామరూపములను చూస్తున్నప్పటికీ వాటితో అతనికి సంబంధంలేదు, వాటికి ఆధారంగా ఉన్న చైతన్యాన్ని చూస్తాడు, అందువలన ఆయనకు వికారం కలుగదు. మోక్షాన్ని గమ్యంగా పెట్టుకోకుండా మీరు పూజలు చేసినా, యజ్ఞాలు చేసినా తిరిగి ఈ భూమి మీదకు రావలసిందే. ఒక్క మోక్షం వచ్చినప్పడు మాత్రమే జననమరణ చక్రం నుండి విడుదల పొందుతావు. మోక్షం యొక్క విలువ మనకు తెలియకపోవటం వలన మన గమ్యం మోక్షం అనే గురి నుండి తప్పకొని ప్రయాణిస్తున్నాము. పుణ్యం గురించి, ఉన్నతమైన జన్మలగురించి ప్రాకులాడుతున్నాము. ఇటువంటి గొడవలలోనికి పోకుండా మోక్షాన్ని గమ్యంగా పెట్టుకొని ప్రయాణించు.

లోకం గొడవలలోనికి వెళ్లవద్దు. ఈ లోకం ఎప్పటినుండి ఉంది? రామాయణం, భారతం ఇవి జరిగాయా లేదా? అనే చర్చల జోలికి వెళ్లవద్దు. ఇటువంటి ప్రశ్నలు అసలు పిల్లలు లేనివాడిని మీ అబ్బాయి వయస్సు ఎంత అని అడిగినట్లుగా ఉంటుంది. అందుచేత ఇటువంటి చిల్లరగొడవల లోనికి వెళ్లవద్దు. నీ లోపల అజ్ఞానం ఉన్నంతవరకు దుఃఖం ఏదో రూపంలో వస్తూనే ఉంటుంది. లోపల ఉన్న అజ్ఞానం కదలటం మంచిది. అది కదలటం వలన నీలో అజ్ఞానం ఉన్నట్లు నీకు తెలుస్తుంది, అప్పడు దానిని తొలగించు కోవటానికి నువ్వు ప్రయత్నం చేస్తావు. మన హృదయం వికశించటానికి, జ్ఞానం కలగటానికి ఏదో ఒక దేవతానుగ్రహం లేక గురువనుగ్రహం మాత్రం చాలు. వివిధ రూపములతో, నామములతో ప్రయాణించి నీ కాలమును వ్యర్థం చేసుకోవద్దు. లోకంలో ఉన్నది అంతా నాది అని పనిచెయ్యి, అలా నీకు ఇష్టం లేకపోతే ఈ లోకంలో ఏదీ నాదికాదు అని పనిచెయ్యి. వీటిలో ఏదో రకంగా పనిచెయ్యటం వలన నీకు తప్పక జ్ఞానం వస్తుంది.

కర్మను అనుభవించటానికి దేహం వచ్చింది. ప్రారబ్దం ప్రకారం దేహయాత్ర సాగుతూ

ఉంటుంది. దేహంతో తాదాత్మ్యం పొందకుండా చూసుకో. నీకు అతి సన్నిహితంగా నీ హృదయంలోనే సత్యవస్తువు ఉన్నప్పటికీ నీలో దేహబుద్ధి ఉన్నంతవరకు అది నీకు వ్యక్తంకాదు. నీవు చేయవలసినది ఏమిటంటే నీ సాధనల ద్వారా దేహబుద్ధిని నశింపచేసుకో, నీ గురి అంతా దేహబుద్ధి మీద పెట్టు, అది నశించినప్పుడు నీలో ఉన్న సత్యం నీకు వ్యక్తమౌతుంది, అప్పుడు అఖండమైన శాంతిని పొందుతావు. దేహప్రారబ్ధం ప్రకారం అన్నీ జరుగుతాయి అని చెపుతున్నారు కానీ పురాణాలలో అనేకమంది తపస్సులు చేసి భగవంతుని దర్శనం పొందినట్లు, వరాలు కోరితే భగవంతుడు ఇచ్చినట్లు చెప్తారు. ఇది ఏమిటి అని భగవాన్‌ను అడిగితే వారు భగవంతుడిని వరాలు అడిగేటప్పుడు వారి దేహప్రారబ్ధం ప్రకారం ఏది జరగాలో అదే కోరుకొంటారు అంతేగాని వేరుగా ఏమీ అడగలేరు అని భగవాన్ చెప్పారు.

మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అది ఒక తలంపు మాత్రమే, అది నిజంకాదు. మన అలవాట్లు, కోరికలు అన్నీ కూడా ఈ నేను అనే తలంపుమీదే ఆధారపడిఉన్నాయి. నేను అనే తలంపు దేహాన్ని కల్పిస్తోంది, లోకాన్ని కల్పిస్తోంది, జనన మరణాలను కల్పిస్తోంది. నేను అనే తలంపు ఉంటేనే ఇవి అన్నీ ఉన్నాయి. ఈ నేను అనే తలంపును పోగొట్టుకోకుండా నీవు ఏది సాధించినా అది స్వప్నంతో సమానము. మనం పూజలు చేసినా, జపాలు చేసినా అవి నేను అనే తలంపును తొలగించుకోవటానికి మనకు సహకరించాలి. కానీ మనం నేను అనే తలంపుతో మోక్షం సంపాదించుకోవాలి అనుకొంటున్నాము, ఇది సాధ్యం కాదు. నేను అనే తలంపు పోతేగానీ మోక్షం రాదు. మన సాధనల ద్వారా నేను అనే తలంపునుండి విడుదల పొందుతున్నామో లేక నేను అనే తలంపు మనలో బలపడుతోందో చూసుకోవాలి. నేను అనే తలంపు బలపడితే అజ్ఞానంలో కూరుకొనిపోతాము. నామరూపదృష్టి ఉన్నంతవరకు దుఃఖం వస్తూనే ఉంటుంది. మానవుడు తన స్వభావమును మార్చుకోవటం చాలా కష్టం. కొంత నిగ్రహం వచ్చినా స్వభావబలంలో అది పోతుంది. ఒక్క ఈశ్వరానుగ్రహం కలిగినప్పడు మాత్రమే ఆ అనుగ్రహప్రవాహంలో ఇవి అన్నీ కొట్టుకొనిపోతాయి.

మనుషులు పుడుతారు చనిపోతారు, మరల పుడతారు చనిపోతారు. ఈ సృష్టినంతా

ఒక శక్తి నడుపుతోంది. అదే సత్యం. సత్యం చేసే పనిని అర్ధం చేసుకొని, దానిని అనుభవిస్తే మనకు నిజమైన ఆనందం కలుగుతుంది. ఆడంబరం లేకుండా పనిచెయ్యి, నిశ్శబ్దంగా పనిచెయ్యి. ఫలితం ఆశించకుండా పనిచెయ్యి అప్పడు మనస్సు అంతుర్ముఖమౌతుంది. అంతర్ముఖమైన మనస్సుకుమాత్రమే బ్రహ్మం వ్యక్తమౌతుంది. దేహమే ఆత్మ అనుకొంటున్నాము. ఆత్మకు దేహానికి సంబంధం లేదు అని మీరు చెపుతున్నారు. అయితే దేహమే ఆత్మ అనే బుద్ధి మాకు ఎందుకు వచ్చింది అని భగవాన్‌ను అడిగారు. బహుజన్మల నుండి వచ్చిన వాసనల యొక్క వేగం వలన దేహమే ఆత్మ అని నీవు అనుకొంటున్నావు. నీలో ఉన్న వాసనలు నిజం కానిదానిని నిజం అనుకొనేటట్లు చేస్తున్నాయి. నేను ఎవడను? అనే ప్రశ్న వేసుకొని అంతర్ముఖం అవ్వటం మొదలు పెట్టాక ఈ దేహం నీవు కాదని నీకు తెలుస్తుంది. ఇప్పడు ఏదయితే నిజం అని నీవు అనుకొంటున్నావో అదేమీ నిజం కాదని అప్పడు నీకు తెలుస్తుంది.

భగవంతుడు ఇన్ని రకాల బాధలను ఈ లోకంలో ఎందుకు పెట్టాడు? ఇంత దుఃఖం ఎందుకు పెట్టాడు? ఇలా ఎందుకు చేస్తున్నాడు? ఈ దుఃఖంను తీసే శక్తి ఆయనకు లేదా? ఆయనకు శక్తి ఉండికూడా ఎందుకు యిలా చేస్తున్నాడు అని భగవాన్‌ను అడిగారు. దుఃఖం తీసే శక్తి ఆయనకు లేకకాదు. దుఃఖం వచ్చినప్పడు నీ మనస్సు అంతర్ముఖమౌతుంది. బాధలు నీవు అంతర్ముఖం అవ్వటానికి సహాయపడతాయి. అంతర్ముఖమైన మనస్సుకు మాత్రమే భగవంతుడు తెలియబడతాడు. అంటే కష్టాలు భగవంతుడుని తెలుసుకోవటానికి సహకరిస్తాయి. అందువలన కష్టాలు పెడుతున్నాడు. అంతేగాని నీ మీద కోపంతో, కక్షతో నీకు కష్టాలు పంపటంలేదు. నీ స్వరూపాన్ని తెలుసుకోవటానికి కష్టాలు సహకరిస్తాయి కాబట్టి కష్టాలు పెడుతున్నాడు అంతేగాని నిన్ను బాధపెట్టాలి అని కాదు. కష్టం ఎలా ఉంటుందో తెలియని వాడికి ఆత్మసౌందర్యం కూడా తెలియదు. నీకు కొంత సహనం ఉంటే ఈ కష్టాలు అన్నీ ఆనందంగా మారిపోతాయి. నీ స్వరూపంలో ఉన్న ఆనందం తెలియటంకోసం ఈ దుఃఖాన్ని పంపుతున్నాడు. దుఃఖాన్ని చూసి నువ్వు కంగారు పడవద్దు. ఈ దుఃఖం అంతా ఆనందంగా మారే రోజులు వస్తాయి.

ఏవో కొన్ని మంచి గుణాలు నీకు ఉంటే సరిపోదు. అహంకారం వేరుతో సహా నశించాలి. దీనికి వైరాగ్యం అవసరం. ఈ ప్రపంచానికి సేవ చేయాలన్నా కొంత వైరాగ్యం ఉండాలి. ఆశ ఉన్నవాడు సేవచేయలేడు. నీకు ఉన్న ధనంతో బాహ్యమైన వస్తువులను ఎలా కొనుక్కొంటున్నావో అలాగే వైరాగ్యం అనే ధనంతో జ్ఞానంను కొనుక్కోవచ్చును. పనిని నీవు ఎప్పుడూ విడిచిపెట్టవద్దు. పనే నిన్ను వదిలిపెట్టాలి అని రామకృష్ణుడు చెపుతూ ఉండేవారు. ఆత్మానుభవం పొందినవాడు పనిచేసినా చెయ్యనివాడితో సమానం. పనిచెయ్యటం వలన వాడు సంపాదించేది ఏమీ లేదు, నష్టపోయేదీ ఏమీ లేదు. మీ డ్యూటీ ఏదో మీరు చెయ్యండి. పని మానివేయనక్కరలేదు. కొద్దిసేపు ధ్యానం చేసుకోండి. ధ్యానం చేయటం వలన వచ్చే శక్తి కర్మకలాపములో ఉపయోగ పడుతుంది. ధ్యానం చేస్తూ ఉంటే నీ దృష్టి మారిపోతుంది. జీవితంలో వచ్చే సంఘటనలు నిన్ను బాధించవు, బంధించవు. పరమేశ్వరుని యందు ధ్యాస ఉన్నవాడికి ధ్యానం కుదురుతుంది. ధ్యానం కుదిరినవాడికి జ్ఞానం వస్తుంది.

ప్రతీమనిషికి సుఖం కావాలి, శాంతికావాలి. వీటికోసం మనం బయట వెతుకుచున్నాము. ఇవి బయట లోకంలో లేవు. ఉన్నదంతా నీ హృదయంలోనే ఉంది. అందుచేత నీవు పైకి ఎదగటం కాదు, హృదయంయొక్క లోతులలోనికి దిగాలి. అక్కడే చైతన్యం ఉంది, అది నీకోసం ఎదురుచూస్తోంది. నువ్వు సాధనచేసి నీ మనస్సును కొంత లోపలకు దింపితే ఆ మహాచైతన్యం నిన్ను లోపలకు గుంజుకుంటుంది. అప్పుడు ఇంక నీ ప్రయత్నం అవసరం లేదు. మనస్సు బయట ఉన్నంతసేపు అనేక సమస్యలను తెస్తూ ఉంటుంది. ఇది ఉన్నంత సేపు సమస్యలు తప్పవు. అందుచేత ఈ మనస్సు అనే సమస్యను మొదట పరిష్కరించుకోండి. మనస్సు అనే సమస్యను పరిష్కరించుకోవటానికే మనం ఈ భూమిమీదకు వచ్చాము. అందువలన ఈ భూమిమీదకు వచ్చిన పనిని పూర్తిచేసుకో.

భగవంతునకు లేక గురువునకు పూర్తిగా తన్నుతాను అర్పించుకోవటమే శరణాగతి. శరణాగతే నిజమైన ప్రార్థన. మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం ఆధ్యాత్మికజీవితానికి చాలా ముఖ్యం. మనస్సు, యింద్రియాలు మన అదుపుతప్పితే మనలను ప్రమాదంలోనికి

తీసుకొనిపోతాయి. మనోనిగ్రహం, యింద్రియనిగ్రహం లేకుండా శరణాగతి సాధ్యంకాదు. నీటిలో మొసలికి ఎంతబలం ఉంటుందో మనలోని అహంకారము, మమకారములకు అంతబలం ఉంటుంది. వీటిని తొలగించుకోవటం అంత తేలికకాదు. మనలోని అహంకారము, మమకారములను తొటగించుకోవటానికి కొంత సేవ, భక్తి, ధ్యానము, విచారణ అవి అన్నీ అవసరమని మన పెద్దలు చెప్పారు. దేహప్రారబ్దం ప్రకారం జరిగే విషయాలతో మనమనస్సు తాదాత్మ్యం పొందటం వలన ప్రకృతిలోనికి పోతూ ఉంటాము. ప్రపంచంలో ఉన్న విషయములను చింతించటం వలన, వాటితో తాదాత్మ్యం వలన ఈ విషములతో సంబంధం లేని బ్రహ్మం మనకు వ్యక్తంకాదు. బయట జరిగే విషయాలకు మనలోపల ఉన్న బ్రహ్మంకు ఎట్టి సంబంధం లేదు. జీవితంలో వచ్చే సమస్యలకు ఉద్రేకపడి, వాటితో తాదాత్మ్యం పొంది లోపలఉన్న సత్యంకు దూరం కాకూడదు. జీవితంలో వచ్చే సమస్యలకు మనస్సు ఎంత ఉద్రేకపడుతోందో జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. మనస్సు నిర్మలంగా ఉంటే, మనస్సును మనం స్వాధీనం చేసుకొంటే ఎవరూ చేయలేనంత ఉపకారం అది మనకు చేస్తుంది.

మనం ఏ రంగంలో ఉన్నా గుర్తింపులు కోరుకోకూడదు. గుర్తింపు దానంతట అదే వస్తే అది నిన్ను బంధించదు. గుర్తింపును నీవు కోరుకుంటే అది నిన్ను బంధిస్తుంది. మనం తీసుకునే నిర్ణయాలు కొంతమందికి ఇష్టం అవ్వవచ్చును. మరికొంతమందికి నచ్చకపోవచ్చును. ఆ నిర్ణయాల వలన కొంతమందికి లాభం కలుగవచ్చును, కొంతమందికి నష్టం రావచ్చును. ఇవి అన్నీ ప్రధానం కాదు. నిర్ణయం చేసేటప్పడు దానికి కారణం ఏమిటి, అప్పడు నీ భావన ఎలా ఉంది అనేది భగవంతుడు చూస్తాడు. అంతేగాని నీ నిర్ణయాలను, ఆ నిర్ణయాల వలన జరిగే విషయాలను భగవంతుడు చూడడు. సద్బుద్ధితో నిర్ణయాలు చేస్తున్నామా లేక ఏమైన ఆశించి చేస్తున్నామా అనేది భగవంతుడు చూస్తాడు. నిర్ణయం వలన వచ్చే మంచి చెడ్డలను భగవంతుడు చూడడు. మనకు వచ్చే తలంపు దేనికి ఉపయోగపడుతోందో చూసుకోవాలి. ఈ తలంపు మనకు ఉపయోగపడుతోందా లేక సమాజమునకు ఉపయోగపడుతోందా లేక దేవుని తెలుసుకోవటానికి ఉపయోగపడుతోందా అని నీకు వచ్చే ప్రతీ తలంపును విచారణ

చేసుకోవాలి. అప్పుడు మాత్రమే నీ మనస్సు అంతర్ముఖమవుతుంది.

దేవుని యొక్క సృష్టి మానవునికి దుఃఖాన్ని తీసుకొనిరావటంలేదు. మనిషి తన కోరికలను నెరవేర్చుకోవటానికి ప్రయత్నిస్తాడు, అవే దుఃఖంను తీసుకొనివస్తాయి. ఒక కోరిక నెరవేరినప్పుడు మరల అనేక కొత్త కోరికలు పుడతాయి. కోరికలు నెరవేరినప్పుడు మనకు పొంగు వస్తుంది. మనమే అన్నీ సాధించుకొన్నామని అనుకొంటాము. అప్పుడు మనస్సు అంతర్ముఖం అవ్వటానికి అవకాశంలేదు. కోరికలు నెరవేరనప్పుడు ఎందుకు నెరవేరలేదని చింతిస్తూ ఉంటాడు. అప్పుడు మనస్సు అంతర్ముఖం అవ్వటానికి అవకాశం ఉంది. బయట ఎక్కడా ఏమీ లేదు అనే విషయం నీ మనస్సుకు అర్థమైతే తప్పక మనస్సు అంతర్ముఖమవుతుంది. వాసనలు ఉన్నంతసేపు అవి మనస్సును తూట్లుపెడుతూ ఉంటాయి. మనస్సును లోపలకు వెళ్ళనీయవు. వాసనల వేగం, అలవాట్లయొక్క వేగం చాలా బలీయమైనది. గురువు అనుగ్రహంలేనిదే ఒక్క చిన్న వాసన నుండి కూడా బయట పడలేము. ఎప్పుడైతే వాసనలు పూర్తిగా నశించాయో అప్పుడు మనస్సు హృదయగుహలో పడిపోతుంది.

లోకంలో జరిగే విషయములు అన్నీ అనిత్యములు, ఆత్మ ఒక్కటే నిత్యం అనే స్థిర నిర్ణయం కలిగి ఉండాలి. ఆత్మానుభవం పొందాలి అనే పట్టుదల కలిగి ఉండాలి. దానినే లక్ష్యంగా పెట్టుకొని నీవు ఓర్పుతో, సహనంతో పనిచేస్తున్నప్పుడు కొంతకాలానికి నీకంటే ఉన్నతమైన శక్తి ఒకటి ఉందని నీకు తెలుస్తుంది. ఆ శక్తే ఈ సృష్టినంతా నడిపిస్తోందని తెలుస్తుంది. అప్పుడు ఆ మహాశక్తికి శరణాగతి చెందుతాము. శరణాగతి చెందినప్పుడు భగవంతుడు తన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, అదే మోక్షం.

నేను పూజలు ఎక్కువగా చేస్తున్నాను. దానికి చాలా డబ్బు ఖర్చు అవుతోంది అని ఒక భక్తుడు భగవాన్‌తో అంటే ఎందుకు ఇది అంతా. ఆ పూజలు చేస్తాననే నేనును వదిలెయ్యి. ఏ ఖర్చు ఉండదు అని చెప్పారు. మీరు వింటున్న మంచి మాటలను, మీకు నచ్చిన మాటలను ఇంటికి వెళ్ళి మననం చేసుకోండి. అలా మననం చేసుకోవటం వలన అవి హృదయంలోనికి దిగుతాయి. ఆ మాటలు నీకు అనుభవంలోనికి వస్తాయి. అవి అనుభవంలోనికి వచ్చినప్పుడు

నీకు సుఖం, శాంతి అందుతాయి. నేను దేవుడిని చూసాను అని ఎవరైనా భగవాన్‌తో అంటే ఆ చూసేవాడిని చూడవయ్యా అనే వారు. నిజమైనదేవుడు నీ హృదయంలోనే ఉన్నాడు. బయటగా నీకు దేవుడు కనిపించినా నిన్ను లోపలకు గెంటడానికే. నీ హృదయంలో ఉన్న దేవుడిని వదిలేసి బయట వెతకటం ఎటువంటిది అంటే నీ చేతిలో ఉన్న బంగారాన్ని బయట పడేసి రోడ్డు మీద ఉన్న పెంకుముక్కలను ఏరుకోవటం వంటిది.

మనం అంతా మోక్షంలోనే ఉన్నాము, ఆనందంలోనే ఉన్నాము. మన స్వరూపం ఆనందస్వరూపం, సుఖస్వరూపం అయినప్పటికీ నాకు సుఖం కావాలి, ఆనందం కావాలి అని బయట వెతుక్కొంటున్నాము. ఇది ఎలా ఉంది అంటే మనం పీక లోతు నీటిలో ఉండి నాకు దాహం వేస్తోంది నీరు కావాలి అని అడిగినట్లుగా ఉంది. నీవు దేహానికి పరిమితమై ఉన్నందువల్ల ఇలా అనుకొంటున్నావు. దేహబుద్ధి పోయినప్పుడు నీ స్వరూపం నీకు తెలుస్తుంది. మొత్తం సృష్టి అంతా నేను అనే తలంపుమీద ఆధారపడి ఉంది. మనం ఎక్కడికి పోయినా ఈ నేను ఉంటాడు. మనం స్వర్గలోకానికి వెళ్ళినా, నరకలోకానికి వెళ్ళినా ఈ నేను అక్కడకు సిద్ధం అవుతుంది. దీనిని తొలగించుకో. ఈ నేను నుండి విడుదల పొందటమే మోక్షం.

ఒకసారి చలంగారు ఆయన స్నేహితుడు దీక్షితులుగార్కి ఉత్తరం వ్రాస్తూ, అరుణాచలం రావాలని ఉందికాని మా దగ్గర డబ్బు లేదు అని చాలామంది నాకు ఉత్తరాలు వ్రాస్తున్నారు. మీ దగ్గర డబ్బు ఉంది మీరు ఇక్కడకు రావాలని అనుకోవటంలేదు అని వ్రాసారు. దానికి దీక్షితులుగారు జవాబు వ్రాస్తూ అరుణాచలంలో ఇప్పుడు భగవాన్ ఎలాగులేరు, ఉన్నది కొండ, అది ఎప్పుడు వెళ్ళినా ఉంటుంది కదా అని వ్రాసారు. చలంగారు మరల ఉత్తరం వ్రాస్తూ మీరు ఎప్పుడు వచ్చినా ఈ కొండ ఉంటుంది కాని ఎప్పుడో వెళదామని అనుకొంటే అప్పటివరకు మీ శరీరం ఉంటుందని అనుకోవద్దు. కొండ మాత్రం ఎప్పుడూ ఉంటుంది. మీ శరీరం ఎప్పుడు పోతుందో చెప్పలేము అని వ్రాసారు. అందువలన భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను తప్పక ఉపయోగించుకోండి. ఎప్పుడో ఏదో చేద్దామని అనుకొంటే మీరు చాలా నష్టపోతారు. వాయిదాలు వద్దు, వర్తమానకాలంలో జీవించండి. వచ్చిన ప్రతీ అవకాశమును

ఉపయోగించుకోండి. భగవద్గీతలో కర్మకు ప్రాముఖ్యత ఇచ్చాడు. నేను పని చేస్తున్నాను అని అనుకోవద్దు. గీతలో కృష్ణుడు చెప్పింది కర్తలేని కర్మ, మనం చేసే కర్మకాదు. కర్తృత్వం లేకుండా పని చేయాలి. భగవంతుడి చేతిలో పనిముట్టులా ఉండి పని చేయాలి. ఆత్మను కేంద్రంగా పెట్టుకొని పనిచేయాలి. నేనూ పనిచేస్తున్నాను అని నిన్ను నీవు మోసం చేసుకోవద్దు. నీవు చేసే ప్రతీ పనిని పరిశీలించుకో. అలా పరిశీలన చేసుకొన్నప్పుడు నీవు చేసే పని నీకోసం చేసుకొంటున్నావో లేక భగవంతుని ప్రీతికోసం చేస్తున్నావో అప్పుడు నీకు తెలుస్తుంది.

మీ ఇంటిలోని ముసలివ్యక్తులను జాగ్రత్తగా చూడండి. ప్రేమతో చూడండి. వారికి కాఫీ ఇవ్వటం, భోజనం పెట్టటం ఎలాగు తప్పదు. అందుచేత చేసేది ఏదో ప్రేమగా చెయ్యండి, చిరాకులు వద్దు. వారిని ప్రేమగా చూడటం వలన మీకు ఎటువంటి బుద్ధిని ఇస్తే భగవంతుడిని తెలుసుకుంటారో అటువంటి సద్బుద్ధిని ఆయన మీకు ప్రసాదిస్తాడు. అందువలన భగవంతుడు మెచ్చే పనులు చెయ్యండి. అంతేగాని అహంకారాన్ని పెంచుకొనే పనులు చెయ్యవద్దు. మనం ఎక్కువగా లోకవిషయాలను స్మరిస్తూ ఉంటాము. వీటి వలన అహంకారం పెరిగిపోతుంది. లోకవిషయాలను స్మరించే బదులు మీకు ఇష్టమైన దైవమును స్మరించుకోండి. దైవమును ప్రీతితో, ప్రేమతో స్మరించటం వలన అహంకారం నాశనం అవుతుంది. అందుచేత విషయాలను స్మరించేబదులు దైవాన్ని స్మరించుకోండి.

"మీరు చెప్పే ఆత్మసుఖం గురించి మాకు తెలియటంలేదు. కాని ఇప్పుడు మేము చాలా సుఖపడుతున్నాము, ఈ ప్రపంచంలో ఎంత ఆనందం అనుభవించాలో అంత ఆనందం అనుభవిస్తున్నాము. ప్రత్యక్షంగా వీటిని అనుభవిస్తూ ఇది అబద్ధం అని ఎలా అనగలము?" అని వివేకానందుని కొంతమంది అడిగారు. ఆయన ఏమని చెప్పారు అంటే "ఇప్పుడు మీరు అనుభవించే సుఖం నిజంకాదు. మీరు అనుభవించే సుఖాలు దొంగకుక్కల సుఖాల వంటివి. దొంగకుక్క తినేటప్పుడు యజమాని కొడతాడనే భయంతోనూ, కంగారుతోనూ తింటూ ఉంటుంది. అటువంటి సుఖాలు మీరు అనుభవిస్తున్నారు. ఇవి స్థిరమైనవి కాదు. ఒక్క ఆత్మసుఖం మాత్రమే ప్రత్యక్షమైనది. అది మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇవి అన్నీ అబద్ధం అని మీకు తెలుస్తుంది. మనకు అసలు ప్రేమలేదు. మనకు ఉన్నది మోహం.

ఆ మోహాన్ని మనం ప్రేమ అనుకొంటున్నాము. తల్లికొడుకుల మధ్య, భార్యాభర్తల మధ్య ఉన్నది మోహం, అది ప్రేమకాదు. కుటుంబంలో ఉన్న సంబంధాలు ప్రేమకాదు, అది మోహం. నిజమైన ప్రేమ ఉపాధికి పరిమితమై ఉండదు. ప్రేమతత్వం తెలిసినవ్యక్తికి భక్తి తెలుస్తుంది. అటువంటి వ్యక్తి భగవంతుడిని ఆరాధిస్తాడు. అప్పుడు వాడి మనస్సు చల్లబడుతుంది, వాడి మనస్సుకు లోచూపు కలుగుతుంది. మాటలు మనిషి మీద ఎప్పుడు ఏవిధంగా ప్రభావం చూపుతాయో చెప్పలేము. అందువలన మంచి మాటలు చెప్పండి. సహృదయంతో మాటలు చెప్పండి, ఎదుటివారి హితంకోరి మాటలు చెప్పండి. అంతేగాని ఆ మాటల వలన ఎదుటి వారిలో మార్పు వచ్చిందా లేదా అన్నది నీకు అనవసరం. అటువంటి గొడవలలోనికి వెళ్ళి ఆందోళన చెందవద్దు. కర్మచేసి ఫలితం గురించి ఆశించేవాడి మనస్సు కలుషితం అవుతుంది. కర్మఫలితాన్ని అనుభవించటం వలన లోకసంబంధం పెరిగిపోతుంది. వాడి మనస్సు అంతర్ముఖం అవ్వదు. కర్మఫలితాన్ని ఆశించేవాడు జన్మజన్మకు భగవంతుడికి దూరమవుతాడు. కొంతకాలానికి భగవంతుడు ఉన్నాడనే సంగతిని మర్చిపోయే స్థితికి దిగజారిపోతాడు".

గౌతమబుద్ధుడు దేవుని పేరు ఎత్తకుండా ఆయన చెప్పవలసిన విషయం చెప్పేవారు, దేవునికి సంబంధించిన చర్చలను ఆయన ఎంకరేజ్ చెయ్యలేదు అని భగవాన్‌తో అంటే దేవుడు ఉన్నాడా? లేడా? అనే చర్చలతో కాలాన్ని వృధా చేసుకొంటున్నారు, ఆ గొడవలు వద్దు. మీరు పొందవలసిన ఆనందం, సుఖం ఇక్కడే మీ హృదయంలోనే ఉంది. వ్యర్థమైన గొడవలలోనికి వెళ్ళకుండా సూటిగా మీ హృదయంలోనికి ప్రయాణం చేయటానికి అనువైన విధంగా ఆయన చెపుతూ వచ్చారు, ఆయన కరుణ అపారమైనది. తన దయ అనే దుప్పటితో సృష్టినంతా కప్పాలనే గొప్పతత్వం బుద్ధుడిది. హృదయంలో ఉన్న మహదానందంలో మనలను ఐక్యపరచటానికి ప్రయత్నించాడు. చిల్లర గొడవలలోనికి వెళ్ళలేదు. ఆయన పొందిన ఆనందమును జీవకోటికి పంచివ్వటానికి ఊరూరు తిరిగాడు. మానవులలో ఉన్న దుఃఖాన్ని ఆర్పటానికి ప్రయత్నించాడు. వాటికి సంబంధించిన విషయాలనే సూటిగా చెప్పాడు. బుద్ధుని ఖ్యాతి పెరగటం చూసి అసూయతో ఆయన బంధువు ఒకరు బుద్ధుడిని చాలా తిట్టాడట. తిట్టటం పూర్తి అయిన తరువాత బుద్ధుడు ఆయనతో "నీవు ఒక మామిడి పండును తెచ్చి

నాకు ఇచ్చావు అనుకో, దానిని నేను తీసుకోకపోతే ఏమవుతుంది?" అని అడిగాడట. "నా వద్దనే ఉంటుంది" అని ఆ బంధువు చెప్పాడు. అప్పుడు బుద్ధుడు "అలాగే నీవు తిట్టిన తిట్లు అన్నీ నేను ఏమీ తీసుకోలేదు" అని చెప్పాడు. అంటే అవి అన్నీ నీకే చెందుతాయి అని అర్థం. ఎదుటివారు మిమ్మలను నిందిస్తూ ఉంటే, మిమ్మల్ని విమర్శిస్తూ ఉంటే అప్పుడు మీరు కనుక సహనంగా ఉంటే మీలోని దోషాలుకూడా వారికి పోతాయి.

భగవంతుడు ఉన్నాడని ముందు విశ్వసించు. మన ప్రణాళిక నెరవేరదని, ఆయన ప్రణాళిక ప్రకారమే అన్నీ జరుగుతాయి అని పూర్తిగా నమ్మటమే శరణాగతి. దేవుడు ఉన్నాడా? లేడా? అనే సంశయం నీకు వస్తూ ఉంటే చర్చలతో నీ కాలాన్ని వ్యర్థం చేసుకోవద్దు. దేవుని గొడవ వదిలెయ్యి. నేను ఉన్నాను అని ప్రతీవాడు నమ్ముతాడు కదా! నేను ఉన్నానా, లేదా అనే సంశయం ఎవరికీ లేదు కదా? ఆ నేను గురించి విచారించు, దాని మూలాన్ని పట్టుకో. కాలాన్ని వ్యర్థం చేసుకోవద్దు. నచ్చిన గురువును ఎంచుకోండి. మీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చేయండి. ఇష్టమైన మార్గంలో ప్రయాణించేటప్పుడు మీకు కష్టం అనిపించదు, తేలికగా ప్రయాణం సాగుతుంది. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా బాగుపడటం ముఖ్యం.

మనస్సును హృదయంలో నిలబెట్టటం ఎలా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. మనస్సు హృదయంలోనే ఉంది కదా! నీవు దానిని విషయాలతో ముడిపెట్టి బుర్రలోనికి తీసుకొని వస్తున్నావు. నీవు ప్రతీ విషయానికి భయపడుతూ ఉంటే అది బుర్రలోనికి వస్తుంది. మీరు ప్రశాంతంగా ఉంటే అది హృదయంలోనే ఉంటుంది. మనలో ఎంతోకొంత శాంతి ఉంటేగాని మనకు పునర్జన్మను తీసుకొనివచ్చే సంస్కారములతో పోరాడలేము. అందువలన శాంతి అవసరం. మిమ్ములను మీరు హింస పెట్టుకోవద్దు. ఎదుటివారు మిమ్మల్ని హింసించినా నిర్మలంగా ఉండండి. మీకు ప్రతికూలంగా జరిగే విషయాలను చూసి కంగారు పడవద్దు, తప్పటడుగులు వేయవద్దు, మరల వెనుకకు రావటం కష్టం అవుతుంది. వివేకమును విడిచిపెట్టవద్దు. పరిస్థితులు నీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా నిర్మలంగా ఉండండి, ఆందోళన చెందవద్దు.

తెలుసుకోవలసిన వస్తువు కోసం నిరంతరం వెదుకు, దాని కోసం తపన పడు. అది

ఎక్కడో లేదు, నీ హృదయంలోనే ఉంది. నిరంతరం నీవు అదే ధ్యాసలో ఉన్నప్పుడు తప్పక అది నీకు వ్యక్తమవుతుంది. జ్ఞాని మాత్రమే మరియొక జ్ఞాని యొక్క స్థితిని తెలుసుకోగలడు, అజ్ఞాని తెలుసుకోలేడు. అజ్ఞాని తెలుసుకోవటానికి ప్రయత్నం చేసినా అది అర్థం కాదు. అందుచేత తన అజ్ఞానస్థితిని జ్ఞానికి అంటగడతాడు. జ్ఞాని చెప్పే మాటలు నిత్యనూతనంగా ఉంటాయి, అవి హృదయసారం, అవి ఆత్మనుండి వచ్చినవి కాబట్టి కలకాలం స్థిరంగా ఉంటాయి. దేహబుద్ధితో చెప్పిన మాటలు అయితే ఆ దేహం పడిపోయినప్పుడు మాటలు కూడా పడిపోతాయి. బట్ట మీద పురుగు ఉంది తీసుకోండి అంటే తీసేసుకొంటున్నారు. ఎందుచేతనంటే బట్టవేరు, మీరు వేరు అనుకొంటున్నారు. మీ మనస్సులో ఈ దోషం ఉంది తొలగించుకోండి అంటే దానిని తొలగించుకోవటం లేదు సరికదా మీకు కోపం వస్తోంది. ఇక్కడ మనస్సు వేరు, మీరు వేరు అనుకోవటంలేదు. మనస్సుతో మీరు తాదాత్మ్యం పొందుతున్నారు. అందుచేత మీకు కోపం వస్తోంది. మనస్సుతో తాదాత్మ్యం వదులుకోండి.

దేహం మరణించేలోపు కామక్రోధముల యొక్క వేగమును తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయాలి. చాలామంది దుర్వాసుడు కోపం గురించి చెపుతారు. ఆయన పూర్తిగా కామాన్ని జయించాడు. ఆయనలోని గొప్ప గుణాలను వదిలేసి కోపం గురించి చెప్పకొంటారు. లోకం తీరు అలాగ ఉంటుంది. ఎదుటివ్యక్తిలోని బలహీనతలను చూడవద్దు, నీలోని బలహీనతలు ఏమిటో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మీరు ఒంటరిగా ఉన్నప్పుడు, ఖాళీగా ఉన్నప్పుడు ఏది ఎక్కువగా గుర్తుకు వస్తోందో చూసుకోండి. అది నీవు పూర్వజన్మలో ఇష్టపడి ఎక్కువగా చేసినట్లు లెక్క. కనిపించిన ప్రతీ వ్యక్తితోను స్నేహం చేయవద్దు. కనిపించిన ప్రతీ పుస్తకం చదవవద్దు. వీటి విషయంలో జాగ్రత్త అవసరం. మంచి పుస్తకాలు చదవటం వలన, మంచి స్నేహాల వలన ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. గాలి బాగా వీస్తుంటే ఇంక విసనకర్రతో మనకు పనిలేదు అలాగే సత్పురుషులు నీకు దొరికితే ఇంక సాధనతో పని లేదు అని ఒక మహాత్ముడు చెప్పాడు. అంటే సత్పురుషులతో గడపటమే సాధన, వారితో ఉండటమే సాధన ఇంక ప్రత్యేకంగా సాధన ఏమీ అవసరం లేదు.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# సజ్జన సాంగత్యం

మనుష్యత్వం, ముముక్షత్వం, మహాపురుషసంశ్రయః అన్నారు శ్రీ ఆదిశంకరులు. ఉత్కృష్టమైన మానవజన్మ లభించినంత మాత్రాన అందరికి ముక్తి యందు ఇచ్ఛ కలుగుతుందని భావించలేము. వివేక, వైరాగ్యముల ద్వారా విషయ భోగాలయందు, అనాత్మ విషయాలందు విముఖత్వం కలగనంత వరకు అంతర్‌దృష్టి కలగదు. ఎలాగైతే ఒక క్రుళ్ళిన విత్తనం మొలకెత్తడానికి పనికిరాదో వికారాలతో కూడిన కలుషిత మనస్సు బ్రహ్మాకారం చెందదు. వాసనా త్యాగమే ముక్తికి సోపానము. వాసనా త్యాగం జరిగి, అంతర్‌దృష్టి కలగాలంటే తగిన సాధన మరియు సత్పురుషుల సాంగత్యం అత్యంత ఆవశ్యకం. సద్గురువు లేదా సత్పురుషులు మనకు మార్గనిర్దేశం చేస్తారు. వాస్తవానికి సజ్జన సాంగత్యమే మనకు సౌభాగ్యం. మనకు కోరిక ఉన్నంత మాత్రాన సత్పురుష దర్శనం లభించదు, కేవలం వారి అనుగ్రహం వల్లనే లభిస్తుంది, అందుకు తగిన అర్హతను మనము సంపాదించాలి. ఒక నదిని దాటటానికి ఒక వంతెన లేదా పడవ ఎలాగైతే అవసరమో, ఈ సంసార సాగరాన్ని దాటి తరించడానికి సత్పురుషుల యొక్క అవసరం అంతే ముఖ్యం. సత్సాంగత్యంతో మోక్షమార్గం సుగమం అవుతుంది. మనకు సద్గురువు లభించడం ఎంత కష్టమో, సద్గురువుకు సత్‌శిష్యులు లభించడం అంతే కష్టం. నదులు ఎక్కడో పుట్టి, అనేక వంపులు తిరిగి, అనేక దిక్కులలో గుట్టలు, రాళ్ళద్వారా ప్రవహించి చివరికి సముద్రంలో లీనమవుతాయి. అదేవిధంగా మనుష్యుల ప్రవృత్తులు, సాధనా పద్ధతులు వేరుగా కనిపిస్తున్నప్పటికీ, తానెవరో? తెలియడమే సాధన గమ్యం!

ఓం తత్ సత్

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

# దేవుడిగా మారేకళను గురువు ద్వారా నేర్చుకోవటమే -జీవిత లక్ష్యం

ఇది నాది, అది నాది అని ఎంతగా చెబుతామో అంతగా మన మనస్సుయొక్క రాజ్యం విశాలమౌతుంది. ఆ వైశాల్యం నామరూపాలు లేకుండా శూన్యమైతే మన జీవితం సఫలమై ఆధ్యాత్మికంగా చక్రవర్తి అయిపోతాము. దానికి గురువు మార్గదర్శకత్వం ఎంతో అవసరము. గురువు అంటే మనకు ఏమాత్రం తెలియని దారులన్నీ చూపిస్తాడు. ఆయన ద్వారా ప్రపంచంలో వ్యాపించి ఉన్న ఆనందాన్ని మనకు అందిస్తాడు కాని మనం గుడ్డివాళ్లము. కళ్లు తాను నేర్చుకొన్న విశేషాలను చూపగలదు. ఆనందపు మెరుపులను పట్టుకోలేవు. తాను ఎవరో తనకు తెలిసిన గురువుతో మనం కలసికదలాలి. మన నడకలో ఏదైనా తప్పు జరిగితే ఆయన సరిచేయగలడు. మనగతం, అనాగతం అన్నీ ఆయనకు పూర్తిగా తెలుసు. ఇతరులు, కుతూహలంగా చేస్తున్నారని మనం అనుసరించకూడదు. గురు మార్గ దర్శతకత్వమే మనకు శ్రీరామరక్ష. ఒక గురువు వద్దకు వచ్చే భక్తులు అందరూ ఒక సదుద్దేశ్యంతో రారు అది ప్రకృతి న్యాయంగా కనిపిస్తుంది. కొందరు సత్యాన్ని పొందాలనే తపనతో వస్తారు. కొందరు గురువుగా ఉండటం ఎలాగో తెలుసుకోవాలని, వారికి అధికారం, గౌరవం, సంపద కలిగి వేలాది శిష్యులతో గొప్ప గురువుగా ఉండాలని భావిస్తారు. సత్యం తెలుసుకోవాలనే కాంక్ష ఉండదు. అసలు శిష్యరికం అంటే కఠినమైన విషయం. మనం శిష్యరికానికి సిద్ధంగా ఉన్నామా? లేక కేవలం ఆషామాషిగా మాత్రమేనా? అలా ఉంటే అక్కడనుంచి తొందరగా వెళ్లిపోవలసి ఉంటుది. మనం నిష్కపటమైన సత్యాన్వేషి అయితే అన్నిటినీ పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉండాలి. అపుడే నిజతత్వం సాధ్యమౌతుంది. అంతేకాని అక్కడ దొడ్డిదారులు లేవు. గురువు స్పర్శ అనేది కంటికి కనబడదు. బుద్ధికి అందదు. కపటశిష్యులు వచ్చి వెళ్లిపోతే వారు గొప్ప అవకాశం నాశనం చేసుకొంటారు. అహంకారం చాలా ప్రమాదమైనది. తాను జ్ఞానిని అయ్యానన్న భ్రమతో అహంకారం సింహాసనం ఎక్కిస్తుంది. తనకు ఏమీ తెలియదన్న ఎఱుక వినయాన్నిస్తుంది. నిజమైనజ్ఞానం అహంకారం కరిగిపోవటం అనివార్యం. అహంకారానికి నిర్మోహస్థితి ఇష్టం ఉండదు. ఇంకా ఇంకా సంపాదించాలని ప్రయత్నిస్తుంది. ఏ సంపాదన అయినా అది మన అంతరంగిక దారిద్ర్యాన్నే చూపుతుందనే విషయం జ్ఞాపకముంచుకోవాలి. జ్ఞానశిఖరాలు ఎక్కడం శ్రమతో కూడిన పని. విషయలాలత్వం పొందటం సులభం. అందుకే సాధనకావాలి. అది నిరంతరం శ్రమ, సంకల్పబలంతో అనుక్షణం ప్రయత్నించటం వల్ల గురుకృప వల్ల సత్యాన్ని పొందటం సాధ్యమౌతుంది. అదే పురాషార్ధం. పైకి లేవటం అన్నింటికంటే గొప్పకళ. మనిషి తనలోని దైవత్వంలో ప్రతిష్టిత కావటమే మనకు మిగిలిన ఒకేఒక రక్షణమార్గం. మనలను గురువు నడిపిస్తున్నాడు అనే స్ఫూర్తి గురుమంత్రం కన్నా గొప్ప శక్తినిస్తుంది. గురుప్రార్థన మనకు, మన మనస్సుకు వారధిని నిర్మిస్తుంది. అదే ధ్యానం, ధారణ, తపస్సు. గురువుకు ఎదురు తిరిగినా చెప్పినమాట వినకపోయినా, నష్టపోయేది, కష్టపడేది మనమే. మన మనస్సులో ఉత్సాహం, గురుభక్తి విశ్వాసం ఎంతవరకూ ఉంటాయో, అంతవరకూ ప్రపంచంలో ఏదీ మనలను అణచలేదు. గురువే పుణ్యక్షేత్రం. పాపాలను కడిగే అమృతసరస్సు. దానితో జీవితలక్ష్యం చేరి సుఖిస్తాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**